క్లుప్తంగా

గీతాకార్మికుడికి ఆర్థికసాయం

తాడూరు: మండలంలోని సిర్సవాడ గ్రామానికి చెందిన గీతా కార్మికుడు మల్లేష్ తాటి చెట్టు నుంచి కిందపడి మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని కౌండిన్య అసోసియేషన్ పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం చేశారు. వెంకటస్వామి గౌడ్, సాయిల్ గౌడ్, మల్లయ్య గౌడ్ తదితరులు కోరారు.

ఎంపీని కలిసిన నాయకులు



కల్వకుర్తి రూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ను మంగళవారం కల్వకుర్తి బీసీ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా ఎంపీ ఇంట్లో కలిశారు. బీసీ సమస్యలపై వారందరూ ఆయనతో చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలు సత్తా చాటాలని ఎంపీ ఆర్ కృష్ణయ్య సూచించినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నకినమోని పెద్ద యాదవ్ విలేకరులకు తెలిపారు. అంజి యాదవ్, సురేందర్ గౌడ్, వెంకటస్వామి గౌడ్ తదితరులున్నారు.

వాహనాలు పట్టివేత

బల్మూర్: అనుమతులు లేకుండా అక్రమంగా మొర్రం తరలిస్తున్న వాహనాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని కొండనాగుల గ్రామానికి చెందిన కొంత మంది జేసీబీ, ట్రాక్టర్ల యజమానులు రెండు రోజులుగా గ్రామ శివారులోని పొలాల్లో అనుమతులు లేకుండా రెండు జేసీబీలు, ఆరు ట్రాక్టర్లలో మొర్రం తవ్వి తరలిస్తుండగా వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ధ్యానంతో ప్రశాంతత

తిమ్మాజిపేట: ధ్యానంతో ప్రశాంతత కలుగుతుందని పిరమిడ్ మాస్టర్లు రాధాకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని కోడుపర్తిలో మంగళవారం ధ్యాన, అహింసా, శాకాహార ప్రచార ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో 45 రోజులుగా కడ్తాల్ పిరమిడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాలు ముగిశాయి. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, జల్లి వెంకటయ్య, రఘుపతిగౌడ్, బుచ్చన్న, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

బల్మూర్: మండల కేంద్రానికి చెందిన కమ్మరి రేణయ్య(72)పై దాడి చేయడంతో ఆదివారం మృతిచెందిన విషయం విదితమే. ఈ ఘటనపై మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు నిందితులపై సీఐ నాగరాజ్ ఆధ్వర్యంలో హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఈ సంఘటనలో నిందితులు మీనుగ ఎర్రయ్య, అతని కుమారుడు మీనుగ శివలను మంగళవారం అరెస్ట్ చేసి కల్వకుర్తి మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కావ్య ఎదుట హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలవాలి



కందనూలు: నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగనమౌని బంగారు బాబు పిలుపునిచ్చారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తాలో నక్సలైట్ల తీరును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో హింస ద్వారా దేనిని సాధించలేరన్నారు. కార్యక్రమంలో కేలో భారత్ జిల్లా కన్వీనర్ రమేష్, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ప్రసాద్ కుమార్, కాలేజ్ ప్రెసిడెంట్ శివ, వెంకటేష్, మల్లేష్, శివ, ఏబీవీపీ కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం బీకే ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. గురువులు పురుషోత్తంరెడ్డి, అనిత, అరుణ, రేణుక, అంజనమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చలువ పందిళ్లు తొలగింపు

కొల్లాపూర్: కృష్ణానదీ తీరంలోని సంగమేశ్వర ఆలయం సమీపంలోకి నదీనీళ్లు చేరుకున్నాయి. నదీ నీటిమట్టం 835 అడుగుల మేరకు చేరుకోవడంతో ఆలయం మరికొద్ది రోజుల్లో నీటిలో మునిగిపోనుంది. వచ్చే రెండు, మూడు రోజుల వ్యవధిలో వాయుగుండం ఉందనే ప్రచారం జరుగుతుండడంతో ముందు జాగ్రత్తగా ఆలయంలోని చలువ పందిళ్లను తొలగించారు. కర్రలు, తడకలు, ఇతర వస్తుసామాగ్రిని తీర ప్రాంతానికి చేర్చారు. మరో 5 అడుగుల మేరకు నీటిమట్టం పెరిగితే ఆలయంలోకి నీళ్లు చేరే అవకాశం ఉంది.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

బిజినేపల్లి: సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని తహసీల్దార్ మహ్మద్ మున్నీరుద్దీన్ అన్నారు. మండలంలోని లట్టుపల్లిలో భూభారతి రెవెన్యూ సదస్సులో గ్రామం నుంచి దాదాపు 41 మంది నుంచి ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. మంగళవారం లట్టుపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో రైతులు భూ సంబంధిత ఫిర్యాదులను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాయకులు గోవిందునాయక్, శివలీల, చంద్రగౌడు, శ్రీశైలం, వెంకటయ్య, చందులాల్, పాండు, శంకర్, శాంతి, కృష్ణ, భారతి, అమర్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.



బిజినేపల్లి మండలం లట్టుపల్లిలో రైతులతో అధికారులు

వెల్దండలో..

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల, కర్రెవానిపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తీక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ కిరణ్‌కుమార్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జొన్నలబొగడ, ముష్టిపల్లి గ్రామాలల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ రమేష్‌నాయక్, రమేష్, ఆర్ఐ శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

67 దరఖాస్తులు

బల్మూర్: మండలంలోని బిల్లకల్, మైలారం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి 67 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కేశవ్, ఆర్ఐలు శివ, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కల్వకుర్తి రూరల్: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. మంగళవారం మండలంలోని రఘుపతి పేట, ఎల్లికట్ట గ్రామాలలో సదస్సులు నిర్వహించారు. రఘుపతి పేటలో 20, ఎల్లికట్టలో16 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించామని తహసీల్దార్ ఇబ్రహీం తెలిపారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని జవాయిపల్లి 102, చుకాయపల్లి 24 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

తాడూరులో..

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో రెవెన్యూ సదస్సులో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

బడుగుల ఆశాజ్యోతి మహేంద్రనాథ్

అచ్చంపేట రూరల్: బడుగుల ఆశాజ్యోతి దివంగత మాజీ మంత్రి మహేంద్రనాథ్‌అని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలో మహేంద్రనాథ్ జయంతిని పలు రాజకీయ, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహేంద్రనాథ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత మహేంద్రనాథ్ నల్లమల ప్రాంతంలో విద్యాలయాలను నెలకొల్పి విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన కృషి వల్లే మాలాంటి వారు రాజకీయాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడ్డారన్నారు. మహేంద్రనాథ్‌ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మహేంద్రనాథ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పారదర్శకంగా ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

బల్మూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తునట్లు ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని పోలిశెట్టిపల్లి, తుమ్మెన్‌పేట, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అడ్వకేట్ రాజేందర్, వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌గౌడ్, జిల్లా నాయకులు కాశన్నయాదవ్, సుధాకర్‌గౌడ్, ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పరమేష్, మురళి, అంజి లబ్ధిదారులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఉప్పునుంతల: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రోగ్రాం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ టి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పాపూర్‌లో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ శైల మాట్లాడుతూ పంటల మార్పిడితో వచ్చే లాభాలను వివరించారు. ఉద్యాన, కూరగాయల సాగుపై మక్కువ పెంచుకోవాలన్నారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ బి రాజశేఖర్ మాట్లాడుతూ పంటల సాగులో సమగ్ర చీడపీడల యాజమాన్యం గురించి వివరించారు. మేలురకం విత్తనాల ఎంపిక, కొనుగోలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలి

తిమ్మాజిపేట: వ్యవసాయంలో రైతులు సాంకేతికతను వినియోగించుకొని జీవ ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు సుమలత, పరమేష్ అన్నారు. మండలంలోని ఇప్పలపల్లి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. కూర గాయాలు, పండ్ల తోటల సాగులో జీవ ఎరువులు, జీవ క్రిమి నాశకాలు వాడాలని అధికారులు రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ కమల్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్, ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

కందనూలు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ద్రోణచార్య స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మొదటి బహుమతి రూ. 20వేలు, రెండో బహుమతి రూ. 10వేలు ఇచ్చేందుకు దాతలు ఆనంద్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు ముందుకొచ్చారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల పథక లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రమణారావు, వినోద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

హెచ్‌ఎంలకు ప్రత్యేక శిక్షణ

తిమ్మాజిపేట: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ సత్యనారాయణ శెట్టి సూచించారు. మండల కేంద్రంలోని మండల రీసోర్స్ కేంద్రంలో మంగళవారం మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 12 పాఠశాలు తిరిగి తెరిచే వరకు పాఠశాలలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. హెచ్ఎలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామన్ మెనూ అమలు చేయాలి



కల్వకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలో మాదిరిగానే కేజీబీవీల్లోనూ కామన్ మెనూను అమలు చేయాలని భావిస్తుందని జిల్లా కేజీబీవీల అధికారిణి శోభారాణి అన్నారు. మంగళవారం పట్టణంలోని కేజీబీవీలో జిల్లాలోని 20 పాఠశాలల వంటల తయారీపై కుక్‌లకు శిక్షణా తరగతులను నిర్వహించారు. పాఠశాలలో వంటకాలను మరింత రుచికరంగా, పరిశుభ్రంగా తయారు చేయటం కొరకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా ఆమె తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుండి నూతన మెనూ అమలులోకి రానుందన్నారు. నూతన మెనూపై జిల్లాలోని 20 కేజీబీవీలలో పనిచేసే 94 మంది వంట సిబ్బందికి 12 రకాల వంటలపై శిక్షణను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని కేజీబీవీల ప్రత్యేకాధికారులు. వంట సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులతో ఎంఈఓ బాలకిషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పారిశుద్ధ్య కార్మికులకు ఆయన పలు సూచనలు చేశారు.పాఠశాలలు ప్రారంభం నాటికి పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వసతులు సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీ ఎల్లయ్య, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

ఉప్పునుంతల: బీజేపీ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు తోట్ల మహేష్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యక్షుడిగా మొకురాల శేఖర్‌గౌడ్, గుండెమోని సహదేవ్, మధనాగుల శివశంకర్, ప్రేమలతారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా మొగిలి అంజి, మొగిలి చంద్రులను, కార్యదర్శులుగా పానుగంటి చిన్నయ్య, కుందేళ్ల బాల్‌రాం, ఇస్లావత్ దేవేందర్, శ్రీనివాస్‌గౌలను ఎన్నుకున్నారు. అదేవిధంగా కమిటీ కోశాధికారిగా వావిలాల పరమేష్‌తోపాటు 34లు మందిని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

అచ్చంపేట రూరల్: టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు సంఘాల నాయకులు సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, పలు కుల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ అందజేత

తిమ్మాజిపేట: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం బాధితురాలికి ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి అందజేశారు. జడ్చర్ల మండలంలోని వల్లూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య రెండు వారాల కిందట వ్యక్తిగత పని మీద తిమ్మాజిపేటకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వార సెల్‌ఫోన్‌ను గుర్తించారు. లక్ష్మయ్య భార్యకు మంగళవారం ఎస్ఐ సెల్‌ఫోన్ అందజేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



తాడూరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పాఠ్య పుస్తకాల పంపిణీ చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాల హెచ్ఎంలకు అందజేశారు. ఇచ్చిన పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు వాహనాలలో చేరవేశారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కొమ్మినేని అరెస్ట్ సరికాదు

అచ్చంపేట రూరల్: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు రేసోజు సాయిబాబు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. 70 ఏళ్ల కొమ్మినేనిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సరికాదని పేర్కొన్నారు. లైవ్ షో చర్చలో పాల్గొన్న విశ్లేషకులు చేసే వ్యాఖ్యలను ఎడిట్ చేసే అవకాశం ఉండదని వివరించారు. సాక్షి మీడియా, కొమ్మినేని శ్రీనివాసరావు క్షమాపణ చెప్పినప్పటికీ కనీసం మందులు తీసుకొనివ్వకుండా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేశారని, ఇలా మీడియా కార్యాలయాలపై రాజకీయ ప్రేరేపిత దాడులు సరైన విధానం కాదన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని డబుల్ బెడ్రూం వాసుల కాలనీ సమస్యలు పరిష్కరించాలని డబుల్ బెడ్ రూమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కాలనీ వద్ద కాలనీవాసులతో కలిసి నిరసన తెలిపారు. నాలుగు నెలలు గడుస్తున్న విద్యుత్ సమస్య పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి, పద్మ, సుభాన్, బాలకృష్ణ, వెంకటేష్, కిరణ్ చారి, సైదులు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంపు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో చేపడుతున్న 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్మికలకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో క్యాంపు నిర్వహించి, పలు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి కావాల్సిన మందులను సైతం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, రఘుపతిపేట పీహెచ్‌సీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

బస్ పాస్ చార్జీల పెంపు సరికాదు

నాగర్‌కర్నూల్ రూరల్: పెంచిన బస్సు పాస్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మల్లికార్జున్, కుర్మయ్య, రాములు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బస్సు బస్సు పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలి

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్సు పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలని తెలంగాణ జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ దార మౌని గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కల్వకుర్తిలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమస్య కల్వకుర్తిలో నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ, సాదిక్, షకీల్, రాము, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం

మన్ననూర్: బీసీల ఉద్యమ రథసారధి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌ను పదర మండల కేంద్రంలో బీసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం మండలంలో ప్రసిద్ధిగాంచిన మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రాములు ఆలయం ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో పదర మండల కేంద్రంలో శ్రీనివాస్ గౌడ్ పుట్టిన రోజు వేడుకను బీసీ నాయకుల సమక్షంలో నిర్వహించారు. అనిల్‌కుమార్, గోలి శ్రీనివాసులు, రాయ శ్రీను, ప్రశాంత్‌చారి, ప్రవీణ్, శేఖర్, బాలాజీ, రేణు యాదవ్, క్షనివాసులు, అజయ్, జగపతిరాజు, నీరంజన్, సైదులు, అనిల్ బిక్షపతి, సురేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

చారకొండ: మండల కేంద్రంలో శివకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేసి మంగళవారం ఫౌండేషన్ చైర్మన్ తిరుమల లావణ్య రిబ్బన్ కట్ చేసి లైబ్రరీని ప్రారంభించారు. ఈసందర్భంగా లావణ్య మాట్లాడుతూ లైబ్రరీలు విజ్ఞాన సోపానాలని, సమాజానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం 100 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.

రూ.లక్ష విరాళం

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ, ఆంజనేయ స్వామి దేవాలయాల నిర్మాణాలకు గోలి శారదమ్మ మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అల్లే సందీప్, శశిధర్, రామచంద్రయ్య, రమేష్, లాలయ్య తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి చేయూత

వెల్దండ: మండలంలోని నగారగడ్డతండాలోని తుల్జా భవానీ ఆలయ నిర్మాణానికి మంగళవారం ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చేయూతనిచ్చారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆలయానికి రూ.70వేల విలువ చేసే స్టీల్, సిమెంట్ మెటీరియల్‌ను సమకూర్చారు. మాజీ సర్పంచ్ దశర థ్‌నాయక్, రమేష్‌నాయక్, నాయకులు లాలు, లచ్చు, సంధ్యా, ఫుల్‌సింగ్, రామోజీ, రాములు, భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

చారకొండ: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఏసారపు అశోక్ గౌడ్, నాయకులు మద్దినారాయణ రెడ్డి, బాలయ్య, శంకరయ్య, మోగిళ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

సబ్ స్టేషన్ స్థల పరిశీలన

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండ పేట గ్రామానికి మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం మంగళవారం విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ ఏడీఈ మాధవి, విద్యుత్ శాఖ కల్వకుర్తి ఏడీఈ శంకరయ్య , ఏఈ సాయన్న గౌడ్ స్థల పరిశీలన చేశారు. అనువైన స్థలాన్ని గుర్తించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలల్లో రెండు ఉపాధ్యాయుల పోస్టు, ఒక నర్సింగ్ పోస్టు ఖాళీగా ఉన్నాయని వీటికి పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారి లత తెలిపారు. ఇంగ్లీష్ కంప్యూటర్ సైన్స్, ఒక నర్సింగ్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు కేజీబీవీ పాఠశాలల్లో ప్రత్యేక అధికారికి అందజేయాలని ఆమె సూచించారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

కొల్లాపూర్: రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివవర్మ, పరశురాములు, అశోక్, తారాసింగ్, నాగరాజు, బాలపీరు, సలీం, శివ, హనుమంతు తదితరులు ఉన్నారు.

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

కొల్లాపూర్: దళితుల అభ్యున్నతికి దోహదపడే జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాలని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్ కోరారు. కొల్లాపూర్‌లో కేవీపీఎస్ సామాజిక శిక్షణా తరగతులు రెండో రోజు కొనసాగాయి. తరగతుల్లో శోభన్ మాట్లాడుతూ నేటికీ గ్రామాల్లో కులవివక్ష కొనసాగుతోందన్నారు. కాశన్న, పరశురాములు, హనుమంతు, రాజు, అశోక్, మల్లేష్, స్వాతి, ఉన్నారు.

అర్హులైన చెంచులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం

లింగాల: అర్హులైన ఆదివాసీ చెంచులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని అచ్చంపేట ఆర్డీఓ మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నంపల్లిలో చెంచులకు గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆమె పరిశీలించారు. 2006లో రెడ్‌క్రాస్ ద్వారా 70 మంది చెంచులకు ఇళ్లు మంజూరు కాగా ఇందులో 53 ఇళ్లు ప్రారంభించగా అర్ధాంతరంగా ఇళ్ల నిర్మాణాలను నిలుపుదల చేశారని చెంచులు ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో స్థలాల పట్టాలను కూడా ఇచ్చారని, అట్టి స్థలాలను తమకు అప్పగించి ఇంటి నిర్మాణాలను చేయించాలని చెంచులు ఆర్డీఓను కోరారు. స్థలాలను చదును చేసుకున్న తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థలాలను అప్పగిస్తామని ఆర్డీఓ చెంచులకు తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో చెంచులోకం రాష్ట్ర అధ్యక్షుడు కాట్రాజు శ్రీనివాసులు, చెంచు నాయకులు సన్నయ్య, సునిల్, లింగస్వామి, చెంచులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడూరు, ఉప్పునుంతల తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎలు రామస్వామి, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతల మండలం తాడూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

వెల్దండ: విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండలంలోని అజిలాపూర్, చెర్కూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింట తిరుగుతూ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలల హెచ్‌హెంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడేరులో..

కోడేరు: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ భాస్కర్‌శర్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాట్లు వార్ల గుడిసెలు ఇతర గ్రామాలకు వెళ్లి బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట

లింగాల: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరుతూ మంగళవారం మండలంలోని దారారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాటను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ గిరిజ మాట్లాడుతూ కేంద్రాలలో అన్ని రకాల వసతులతో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందుతుందన్నారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.